జపాన్‌కు చెందిన వాహన తయారీ సంస్థ హోండా.. థర్డ్ జనరేషన్‌గా దేశీయ మార్కెట్‌లోకి సరికొత్త అమేజ్ మాడల్‌ను విడుదల చేసింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు ధరల శ్రేణి రూ.7.99 లక్షల నుంచి రూ.10.89 లక్షలుగా ఉన్నది.

అమెరికా-చైనా టెక్ వార్

ఇరు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం

సెమీకండక్టర్ ఇండస్ట్రీలో ఆధిపత్య పోరు

వాషింగ్టన్/బీజింగ్, డిసెంబర్ 4: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలైంది. అయితే ఈసారిది టెక్నాలజీ వార్‌ను సంతరించుకున్నది. చిప్ తయారీపై తీవ్ర ప్రభావం చూపేలా ఇరు దేశాలు పరస్పర ఆంక్షల్ని, నిషేధాల్ని తెచ్చిపెట్టుకున్నాయి మరి. ఈ మేరకు సోమవారం బైడెన్ సర్కారు నిర్ణయాలుంటే.. వాటికి ప్రతిగా మంగళవారం జిన్‌పింగ్ ప్రభుత్వం నిర్ణయాలు వచ్చాయి. నిజానికి గ్లోబల్ సెమీకండక్టర్ ఇండస్ట్రీలో అమెరికా, చైనాలు ఆధిపత్యం కోసం గత కొంతకాలం నుంచి కొట్టుకుంటున్నాయి. దాన్ని తీవ్రతరం చేస్తూ అమెరికా కొన్ని కొత్త నిబంధనల్ని తీసుకొచ్చింది. ఇవి 140 చైనా సంస్థల్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇందులో ప్రధాన సెమీకండక్టర్ తయారీ సంస్థలైన పయోటెక్, సైక్యారియర్, నౌరా టెక్నాలజీ గ్రూప్‌లున్నాయి. కాగా, అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్ (చిప్) తయారీ టెక్నాలజీ చైనాకు అందకూడదనే లక్ష్యంగా ఆయా ఎగుమతులపై అమెరికా ఆంక్షల్ని విధించినట్టు తెలుస్తున్నది. కటింగ్-ఎడ్జ్ అడ్వాన్స్‌మెంట్స్ సాంకేతికతలో చైనా దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో దానికి బ్రేకులు వేసేందుకే ఆ టెక్నాలజీలో బలంగా ఉన్న అగ్రరాజ్యం ఈ చర్యలకు దిగిందన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

చైనా ప్రతీకార చర్యలు

అమెరికా తీరుకు చైనా గట్టిగానే స్పందించింది. సెమీకండక్టర్ల తయారీలో కీలక పాత్ర పోషించే విడిభాగాల ఎగుమతులకు బ్రేక్ వేసింది. అమెరికాకు గాలియం, జర్మేనియం, ఆంటిమోని తదితర ప్రధాన హై టెక్నాలజీ సరకు రవాణాకు కళ్లెం వేసింది. జాతీయ భద్రతపై ఆందోళనల దృష్ట్యా మిలిటరీ కోసమైనా, పౌర అవసరాల కోసమైనా జరిగే వీటి ఎగుమతుల్ని నిషేధిస్తున్నట్టు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇంతకుముందు వీటి ఎగుమతులపై ఆంక్షలుండగా, ఇప్పుడు పూర్తిగా నిషేధాన్ని తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా గాలియం, జర్మేనియం లభ్యత చాలా చాలా తక్కువగా ఉన్నది. దొరికే ఆ కొద్ది నిల్వలు సైతం చైనాలోనే ఎక్కువగా ఉన్నాయి. కాగా, సెల్‌ఫోన్లు, కార్లు, సోలార్ ప్యానెల్స్, మిలిటరీ టెక్నాలజీల్లో వాడే కంప్యూటర్ చిప్స్ తయారీకి ఈ ముడి పదార్థాలన్నీ కూడా చాలా చాలా కీలకం. ఇంకా చెప్పాలంటే మిలిటరీ అప్లికేషన్ల దగ్గర్నుంచి కృత్రిమ మేధస్సు వరకు ఈ సెమీకండక్టర్లే ప్రధానం. దీంతో అమెరికా-చైనా వాణిజ్య సంబంధాలు ఒక్కసారిగా చెడినట్టైంది. అంతకుముందు అమెరికా.. కొత్త తరం సాంకేతికతతోకూడిన చిప్‌ల తయారీలో వినియోగించే పరికరాలు, అత్యున్నత శ్రేణి మెమరీ చిప్స్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల్ని కఠినతరం చేసింది. గతంలోనూ వీటిపై నిషేధం విధించినా ఆ తర్వాత సడలించింది. మానవ సాయంతో నిమిత్తం లేకుండా స్వయంప్రతిపత్తితో పనిచేయగలిగిన ఆయుధాల తయారీలో ఈ చిప్‌లే కీలకం. వాటి విడిభాగాలు ప్రస్తుతం అమెరికా నుంచే చైనాకు పెద్ద ఎత్తున వెళ్తున్నాయి.

చిప్ తయారీ రంగం కేంద్రంగా పరస్పర ఆంక్షలు

ట్రంప్ రాకముందే రాజుకున్న మంటలు



ట్రంప్ రాకముందే..

అమెరికా నూతన అధ్యక్షుడిగా మరోసారి డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో గద్దెనెక్కబోతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ వచ్చిన తర్వాత అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలవుతుందన్న అంచనాలు నెలకొన్నాయి. కానీ ఇప్పుడే ఆ వాతావరణం ఏర్పడటం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. నిజానికి ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కంటే ఆ స్థానంలో ముందున్నది ట్రంపే. అప్పుడు ట్రంప్ దూకుడు.. చైనాతో పరస్పర సుంకాలకు దారితీసింది. కానీ బైడెన్ రాకతో పరిస్థితులు కొంత శాంతించాయి. అయినప్పటికీ గత మూడేండ్లలో అమెరికా-చైనా మధ్య ఈ రకమైన పోరు వస్తూపోతూనే ఉన్నది. ఇప్పుడది తీవ్రరూపం దాల్చగా.. ట్రంప్ రాకతో ఇంకెంత తీవ్రతను సంతరించుకుంటుందోనన్న ఆందోళనలు అంతటా వ్యాపిస్తున్నాయిప్పుడు. ఇక ట్రంప్ హయాంలో చైనా నుంచి అమెరికాకు పెద్ద ఎత్తున జరిగే ఎగుమతుల కట్టడే లక్ష్యంగా సుంకాల పెంపు జరిగింది. కానీ ఇప్పుడు చిప్ తయారీలో ఆధిపత్యం కేంద్రంగా నిర్ణయాలుంటున్నాయి. మొత్తానికి వచ్చే ఏడాది నుంచి సెమీకండక్టర్ ఇండస్ట్రీల్లో అలజడులు ఖాయమనే చెప్పవచ్చు.

భారత్‌కు లాభమేనా?

అమెరికా-చైనా మధ్య చోటుచేసుకున్న ఈ ట్రేడ్ అండ్ టెక్ వార్.. భారత్‌కు లాభమేనా? అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఇందుకు ట్రంప్ హయాంలో వచ్చిన అవకాశాల్నే గుర్తుచేస్తున్నారు. నాడు చైనాతో అమెరికా వాణిజ్యం పడిపోగా.. భారత్‌సహా మరికొన్ని దేశాలకు పెరిగింది. అమెరికాకు భారత్, వియత్నాం, మెక్సికో నుంచి ఆయా ఉత్పత్తుల ఎగుమతి పుంజుకున్నది. ఇప్పుడు కూడా అమెరికా సాయంతో సెమీకండక్టర్ ఇండస్ట్రీలో భారత్ నిలదొక్కుకోవచ్చన్న అంచనాలున్నాయి. నిజానికి అంతర్జాతీయంగా భారత్ ఎదుగుదలను చైనా అడ్డుకుంటున్నది. కానీ ఇదే సమయంలో భారత్‌పట్ల అమెరికా సానుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నది. పైగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, డొనాల్డ్ ట్రంప్‌కు నడుమ మంచి స్నేహభావం ఉండటం కూడా ఇక్కడ కలిసొస్తుందని అంటున్నారు. భారత్ వంటి పెద్ద మార్కెట్‌ను వదులుకోవడం అమెరికాకు నష్టమేనని, కాబట్టి సాంకేతికంగా అగ్రరాజ్యం నుంచి సహకారం ఉంటుందనే ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే అమెరికా తాజా నిర్ణయం జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ తదితర దేశాలనూ కొంత ఇబ్బంది పెడుతున్నది. దీంతో ఆసియా మార్కెట్‌లో అమెరికా-చైనా ట్రేడ్ వార్ గట్టిగానే ప్రకంపనల్ని సృష్టించేలా ఉన్నది.

జహీరాబాద్ నిమ్జ్‌లో ప్యూర్ ఈవీ ప్లాంట్

రూ.400 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ



హైదరాబాద్, డిసెంబర్ 4: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ప్యూర్ ఈవీ..తెలంగాణలో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే సంగారెడ్డి వద్ద ప్లాంట్ ఉండగా, కొత్తగా జహీరాబాద్ నిమ్జ్‌లో రూ.400 కోట్ల పెట్టుబడితో మరో ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఫౌండర్, ఎండీ నిశాంత్ డొంగ్రీ తెలిపారు. 40 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయబోతున్న ఈ యూనిట్ వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. నెలకు 12 వేల నుంచి 15 వేల యూనిట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో కొత్తగా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న సంగారెడ్డి ప్లాంట్‌తో 500 మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కంపెనీకి చెందిన వాహనాలకు దేశవ్యాప్తంగా డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ నూతన ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశీయంగా 70 రిటైల్ అవుట్‌లెట్లు ఉన్నాయని, వచ్చే రెండున్నరేండ్లలో మరో 250 డీలర్‌షిప్‌లను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మరోవైపు, స్కూటర్, మోటార్‌సైకిళ్లలోనూ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ప్రముఖ వంటనూనెల ఉత్పత్తి సంస్థ గోల్డ్‌డ్రాప్‌ను మరోసారి ప్రతిష్ఠాత్మక సీఐటీడీ అవార్డు వరించింది. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్‌డ్రాప్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా అందుకున్నారు.

బీసీబంధు పథకం అమలు చేయాలి: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, డిసెంబర్4 (నమస్తే తెలంగాణ): బీసీబంధు పథకాన్ని వెంటనే అమలుచేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరారు.

బుర్రా వీఆర్‌ఎస్‌కు ఆమోదం

నేడు టీజీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తేతెలంగాణ): సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణకు ఆమోదం తెలుపుతూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. విద్యాశాఖ స్పెషల్ సీఎస్‌గా పనిచేస్తున్న ఆయన్ని టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే.

యూపీఐ లైట్ పరిమితి 5 వేలకు పెంపు

ముంబై, డిసెంబర్ 4: యూపీఐ లైట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీలు జరిపేవారికి రిజర్వుబ్యాంక్ శుభవార్తను అందించింది. యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. అలాగే ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.500 నుంచి రూ.1,000కి సవరించింది. ఎలాంటి పిన్ నంబర్ లేకుండానే ఆఫ్‌లైన్‌లో మొబైల్ ద్వారా లావాదేవీలు జరిపేందుకుగాను ఆర్బీఐ గతంలోనే లైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవల కోసం యూపీఐ లైట్ వ్యాలెట్‌ను నగదు ఉంచాల్సి ఉంటుంది.

హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ): ఇంటర్నెట్ సర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్..హైదరాబాద్‌లో సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్(జీఎస్‌ఈసీ)ని నెలకొల్పడానికి ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. దేశంలో తొలి సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ కాగా, అలాగే ప్రపంచంలోనే ఐదోది కావడం విశేషం. ఈ జీఎస్‌ఈసీ ఏర్పాటునకు సంబంధించి గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం హాన్సెన్ మాట్లాడుతూ..డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో రాష్ట్రం ముందంజలో ఉన్నదని, ప్రపంచవ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉన్నదన్నారు. ఈ నూతన సేఫ్టీ సెంటర్ ద్వారా సైబర్ సేఫ్టీ సమస్యలను వేగవంతంగా పరిష్కరించడానికి వీలు పడనున్నదన్నారు. అలాగే ఈ సెంటర్‌తో వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులకు కిక్కు

జీఎస్‌ఈసీ ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్. ఇది అధునాతన భద్రత, ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించనున్నది. ఏఐ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పరిశోధకులకు ఈ సేఫ్టీ సెంటర్ సహకారం అందించనున్నది. ఇదిలావుంటే దేశంలో నైపుణ్యాభివృద్ధిని, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంగా ఈ సెంటర్ పని చేయనున్నది.

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్

కొనసాగుతున్న రుపీ పతనం

ముంబై, డిసెంబర్ 4: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి చారిత్రక కనిష్ఠ స్థాయికా జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు కోల్పోయి 84.75 వద్దకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం వల్లనే కరెన్సీలు పతనం చెందాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.66 వద్ద ప్రారంభమైన రుపీ-డాలర్ రేటు 64.65-84.76 స్థాయిలో కదలాడింది.

న్యాయ సాయం అందిస్తాం

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సౌజన్య

ఎదులాపురం,డిసెంబర్ 4 : బాధితులకు డీఎల్‌ఎస్‌ఏ తరపున ఉచిత న్యాయ సహాయంతో పాటు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి బోనగిరి సౌజన్య అన్నారు. ప్రజా పాలన వారోత్సవాల్లో భాగంగా బుధవారం రిమ్స్‌లో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం చేప్టటారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సౌజన్య, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ హాజరయ్యారు. అనంతరం హెచ్‌ఐవీ మందులు క్రమంతప్పకుండా వాడుతున్న వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ గజానన్, సీపీఎం నాగరాజు, ఏఆర్‌టీ డాక్టర్ పద్మిని, ప్రియదర్శిని, అభిషేక్, ఏఆర్‌టీ సిబ్బంది, పాజిటివ్ వర్క్ సరిత, ఎన్‌జీవో సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.

అటవీ సంపద అందరి బాధ్యత

ఇచ్చోడ: సిరికొండలో మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్‌వో నాగవత్ స్వామి

బోథ్, డిసెంబర్ 4 : అటవీ సంపదను కాపాడుకోవడం అందరి బాధ్యత అని బోథ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టీ ప్రణయ్ అన్నారు. బుధవారం వన్యప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బోథ్ అటవీ శాఖ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌వో మాట్లాడుతూ రోజు రోజుకు అంతరించి పోతున్న అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. వన్యప్రాణులతో ఏమైన నష్టం జరిగితే ప్రభుత్వ పరంగా పరిహారం చెల్లించడానికి వీలు ఉందన్నారు. వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్ అర్బన్ పార్క్‌లో

ఖానాపూర్ టౌన్, డిసెంబర్ 4: ఖానాపూర్‌లోని అర్బన్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్బన్ పార్క్‌లో స్థానిక పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణులు, జీవవైవిధ్యంపై ఎఫ్‌ఆర్‌వో కిరణ్ అవగాహన కల్పించారు. జంతువుల సంరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అనంతరం అర్బన్ పార్క్ సందర్శనలో భాగంగా విద్యార్థులకు పలు రకాల పక్షులు, పక్షులు నివాసం ఉండేందుకు వీలుగా ఏర్పాటు చేసుకున్న గూళ్లు చూపించారు. కార్యక్రమంలో డీఆర్‌వో మహేశ్, ఎఫ్‌ఎస్‌వో రవి, ఎఫ్‌బీవోలు నరేందర్, ముత్యం పాల్గొన్నారు.

వన్యప్రాణులను కాపాడుకోవాలి

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 4: అటవీ సంపద, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కవ్వాల్ జోన్ సిరిచెల్మ ఎఫ్‌ఆర్‌వో నాగవత్ స్వామి అన్నారు. సిరికొండలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించా రు. అలాగే ఇచ్చోడలో ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఇచ్చోడ రేంజ్ ఆఫీసర్ పుండలిక్, డిప్యూటీ రేంజర్ గిరయ్య, తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో రవీందర్, ఎంఈవో సునీల్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటిన చెట్లను సంరక్షించుకునే బాధ్యత అందరిది

ఇంద్రవెల్లి, డిసెంబర్ 4 : ప్రభుత్వ భూములతో పాటు అటవీ ప్రాంతంలో నాటిన మొక్కలతో పాటు చెట్ల రక్షణ బాధ్యత అందరిపై ఉందని ఎఫ్‌ఆర్వో సంతోష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. మొక్కలను నాటాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, పట్టణ అధ్యక్షుడు ఎండీ జాహీర్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న చెరువు పరిశీలన

వెంకూర్ చెరువును పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్

కుంటాల, డిసెంబర్ 4 : కుంటాల మండలంలోని వెంకూర్ సమీపంలో 1350 ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో రూ. 1.47 కోట్లతో 2006లో నిర్మించిన ఈ జలాశయం నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఏడాదికే బుంగపడి నీరంతా వృథాగా పోతోంది. నాణ్యత ప్రమాణాలు పాటించక నాసిరకంగా నిర్మించిన కాంట్రాక్టర్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆదిలాబాద్ చీఫ్ ఇంజినీర్ టీ శ్రీనివాస్ చెరువును పరిశీలించి వాస్తవ పరిస్థితిని తెలుసుకున్నారు. మ్యాపులు తయారు చేసి మరోసారి ఎస్టిమేషన్ ప్రతిపాదనలు పంపుతామని ఇరిగేషన్ ఈఈ జాదవ్ అనిల్ అన్నారు. ఎస్‌ఈకే రవీందర్, ఏఈఈ మీరాజుద్దీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జైనథ్, డిసెంబర్ 4: జైనథ్ మండలం పూసాయి గ్రామానికి చెందిన మేకల అశోక్(51) మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..అశోక్ ప్రతి రోజూ మాదిరిగానే కూలి పనికి వెళ్లాడు. ఈ క్రమంలో సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా మార్గ మధ్యంలో పూసాయి ఎక్స్ రోడ్డు దగ్గర గుర్తు తెలియని వాహనం పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా నుంచి ఆదిలాబాద్ వైపుకు వస్తూ వాహన డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ అశోక్‌ను ఢీ కొట్టాడు. అశోక్ తల, కాలుపై బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం రాత్రి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎన్‌హెచ్ 44 అంబులెన్స్ ద్వారా రిమ్స్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని కుమారుడు మేకల ఆకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమంత్ రథ వాహనం ఊరేగింపు

స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఎదులాపురం, డిసెంబర్ 4: ఆదిలాబాద్‌లోని అతి పురాతన శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మఠం జాతరను పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం హనుమంత్ రథ వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రథోత్సవ వేడుకలను అట్టహాసంగా జరపనున్నట్లు మఠాధిపతి యోగనంద సరస్వతి తెలిపారు. సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖాత్రి పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

తలమడుగు, డిసెంబర్ 4: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రయోగాలను తిలకించారు. పాఠశాల స్థాయిలో రాణించిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి వెంకట్ రావ్, ఉపాధ్యాయులు, వెంకటేశ్వర్, వినోద్ రెడ్డి, చంద్రమ్మ, మురళీధర్, రాజేందర్, రాకేశ్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రయోగాలు

పరీక్ష రాసి వచ్చేలోపు సెల్ ఫోన్లు మాయం

ఎదులాపురం, డిసెంబర్ 4: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని నలంద కళాశాలలో పరీక్షలు రాసి వచ్చే లోపు నలుగురు విద్యార్థుల సెల్‌ఫోన్లు దొంగతనమయ్యాయి. బుధవారం డిగ్రీ పరీక్ష కొనసాగుతున్నది. పరీక్ష రాయడానికి నలుగురు విద్యార్థులు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లను బైక్‌లోని టూల్ బాక్స్‌లో ఉంచి లాక్ వేసి పరీక్ష రాయడానికి కేంద్రానికి వెళ్లారు. పరీక్ష రాసి తిరిగి వచ్చి సెల్‌ఫోన్‌ను చూసే సరికి అప్పటికే తమ ద్విచక్ర వాహనాలకు సంబంధించిన టూల్ బాక్స్ కింద పడిపోయి ఉంది. గమనించిన విద్యార్థులు ఒక్కసారిగా కంగుతిన్నారు. ఈ సంఘటనను మావల పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ విష్ణువర్ధన్‌కు జరిగిన విషయాన్ని తెలియజేశారు. సీఈఐఆర్ పోర్టల్‌లో ఎస్‌ఐ ద్వారా ఫిర్యాదు చేయించారు.

ప్రశ్నించే గొంతు నొక్కేందుకే కుట్రలు

కుభీర్, నవంబర్ 4: ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలపై మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నిలదీస్తున్నందుకే కక్షగట్టి ఆయనపై కేసులు బనాయించి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నీల అనిల్, మాజీ వైస్ ఎంపీపీ మోహియొద్దీన్, పుప్పాల పీరాజీ మండిపడ్డారు. బుధవారం కుభీర్‌లో మాట్లాడుతూ ఈపాటికే ఆయనపై నాలుగు కేసులు నమోదు చే యడంతో పాటు, మంగళవారం ఫోన్ ట్యా పింగ్ కేసుపెట్టారని అక్రమ కేసులతో బెదిరించే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు.

వానల్‌పాడ్ ఎల్లమ్మ ఆలయంలో చోరీ

భైంసాటౌన్, డిసెంబర్ 4 : మండలంలోని వానల్‌పాడ్ గ్రామ ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. భైంసారూరల్ సీఐ నైలు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మ ఆలయంలో రెండు హుండీలతో పాటు పక్కనే ఉన్న దుర్గామాత వెండి ముక్కుపుడకను దొంగలు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. రెండు హుండీల్లో రూ. 16,500 నగదు దొంగలించినట్లు పేర్కొన్నారు. రెండు బృందాలుగా ఏర్పడి దొంగల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆలయ కమిటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కుభీర్ ః డిసెంబర్ 4: మండలంలోని నిగ్వ గ్రామానికి చెందిన గుంచెటి స్వప్నకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.60వేలు మంజూరయ్యాయి. బుధవారం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బాధితురాలి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దత్తు పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో రైతులకు మేలు

కడెం, డిసెంబర్ 4 : పశువులలో కృత్రిమ గర్భధారణతో రైతులకు మేలు జరుగుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ పశువైద్యాధికారి రామారావు అన్నారు. కల్లెడ గ్రామంలో పశు సంవర్ధక శాఖ, పశు గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించి,అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సౌందర్య, గోపాల మిత్ర సూపర్‌వైజర్ గోపాల్, విజయ డెయిరీ మేనేజర్ వెంకటసాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం

తాంసి, డిసెంబర్ 4: త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. బుధవారం మండలంలోని గిరిగామ, అట్నంగూడ, పాలోడి గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి పరిశీలించారు. కావాల్సిన ఏర్పాట్లపై పంచాయతీ కార్యదర్శులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీవో లింగయ్య, పంచాయతీ కార్యదర్శులు కార్తీక్, సంధ్య రాణి, సిబ్బంది ఉన్నారు.